క్లుప్తంగా

మంగరాయ సన్నిధిలో పవమాన హోమం



పవమాన హోమం నిర్వహిస్తున్న పండితులు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయ స్వామి సన్నిధిలో ఆదివారం పవమాన హోమం జరిగింది. ఆలయ మేనేజర్ కొప్రేష్ ఆచార్ ఆధ్వర్యంలో ముందుగా పూజారులు గురురాజా ఆచారి, అక్షయ్‌లు మంగరాయ ఆంజనేయస్వామికి ఫల పంచామృతాభిషేకం, ప్రత్యేక పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామి విగ్రహం ముందు బ్రాహ్మణ వేద పండితులు హోమాన్ని నిర్వహించారు.

ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ మండల నాయకులు ముత్తన్న

ఆదోని సెంట్రల్: ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల నాయకులు ముత్తన్న డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదోని, కౌతాళం ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళిక పేరుతో మానసిక ఒత్తిడికి గురి చేయడం సరికాదన్నారు. విద్యార్థులకు సెలవుల్లో కూడా తరగతులను నిర్వహించడం దారుణమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు నాగరాజు, సంగమేశ్వర్, భీమారెడ్డి, సిద్ధలింగ, తిక్కస్వామి, పార్థసారథి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



రామకృష్ణ (ఫైల్)

కోసిగి: మండల కేంద్రం కోసిగి కడపాశెం వీధిలోని బసవన్న కట్ట సమీపంలో నివాసం ఉంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పరసాని కోసిగయ్య కుమారుడు పరసాని రామకృష్ణ(35) అనే వైఎస్సార్ సీపీ కార్యకర్త అనారోగ్యం బాధపడుతుండేవాడు. ఆయన కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తరుపున వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి కోసిగికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. మృతి తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను పరమార్శించారు. ఎమ్మెల్యే కుటుంబం ఎళ్ల వేళల అండగా ఉంటామని భరోసా కల్పించారు. మృతినికి భార్య , ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



నాగనాథనహళ్లిలో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు బి.వెంకన్న డిమాండ్ చేశారు. సీపీఐ శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలో జెండాను ఆవిష్కరించి, బాణసంచా కాలుస్తూ పండుగ చేసుకున్నారు.

సీపీఎం బైకు ర్యాలీ



బైకు ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్: సీపీఎం 23వ జిల్లా మహాసభల సందర్భంగా ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో ఆదోని నుంచి ఎమ్మిగనూరు వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న మాట్లాడుతూ జిల్లా మహాసభల్లో మండలంలోని అనేక సమస్యలపై తీర్మానాలు చేసి రాబోయే మూడేళ్లల్లో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించడానికి సీపీఎం నాయకత్వం సన్నద్ధమవుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు బి.వీరారెడ్డి, డి.రామాంజనేయులు, ఉచ్చీరప్ప, జె.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైన్ షాపులా.. బార్లా?

- వైన్ షాపు పక్కనే షెడ్ వేసి తాపుతున్న నిర్వాహకులు
- రాత్రి 11 గంటల వరకూ విక్రయాలు
- విచ్చలవిడిగా బెల్టుషాపులు
- పట్టించుకోని ఎక్సైజ్‌శాఖ అధికారులు



ఆదోనిలో పాత ఓవర్ బ్రిడ్జి చివరన వైన్‌షాపు పక్కనే మద్యం తాగేందుకు ఏర్పాటు చేసిన షెడ్

ఆదోని అర్బన్: కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యానికి హద్దే లేకుండా పోయింది. వైన్ షాపులు బార్లను తలపిస్తున్నాయి. కొందరు నిర్వాహకులు కూటమి నాయకుల అండదండలతో మద్యం దుకాణం పక్కనే షెడ్‌ను ఏర్పాటు చేసి మందుబాబులకు పూటుగా తాపిస్తున్నారు. అంతే కాకుండా విచ్చలవిడిగా బెల్టు షాపులను ఏర్పాటు చేసుకొని జోరుగా వ్యాపారం సాగిస్తున్నారు. అయినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నియోజకవర్గంలో 10 వైన్ షాపులు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రైవేట్ మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించింది. ఆదోని నియోజకవర్గంలో 5 బార్ అండ్ రెస్టారెంట్లు ఉండగా, 10 వైన్ షాపులు ఉన్నాయి. పట్టణంలో 10, రూరల్‌లో 2 షాపులను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో పాటు ప్రతి గ్రామంలో బెల్టుషాపులు జోరుగా నడుస్తున్నాయి. అంతేగాకుండా కూటమి నాయకుల అండదండలతో పట్టణంలో కొన్ని వైన్ షాపుల వద్ద ప్రత్యేకంగా షెడ్డును, గదిని ఏర్పాటు చేసి బార్ షాపుల మాదిరిగా తాపిస్తున్నారు. వారికి సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారు. కూల్‌డ్రింక్స్, గ్లాసులు, నాన్‌వెజ్ కూడా అందుబాటులో పెట్టి తాగించేస్తున్నారు. అంతేగాకుండా ధాబాలో కూడా మద్యం లభిస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బెల్టుషాపులు పెట్టకూడదు, వైన్‌షాపుల వద్ద తాగరాదని నిబంధనలు పెట్టినా వైన్ షాపు నిర్వాహకులు, ఎక్సైజ్‌శాఖ అధికారులు పెడచెవిన పెట్టడమేగాకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గత ప్రభుత్వంలో కట్టడి..

ప్రస్తుత ప్రభుత్వం మద్యం దుకాణాల్లో రాత్రి 11 గంటల వరకు విక్రయాలకు అనుమతులు ఇచ్చింది. దీంతో మద్యం దుకాణాల వద్ద రాత్రి వేళల్లో మందుబాబులు పూటుగా తాగి రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పడిపోతున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మద్యం షాపులను ప్రభుత్వం ద్వారానే నడిపించారు. ప్రభుత్వానికి ఆదాయ వనరుగా ఉన్నా కూడా ఆదాయాన్ని పట్టించుకోకుండా ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సమయంలో మద్యం విక్రయించాలని సమయాన్ని కేటాయించారు.

కమిషన్ తగ్గించడంతోనే..

మద్యం విక్రయాల ద్వారా వచ్చే సొమ్ము రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన ఆదాయవనరుగా మారింది. ఈ నేపథ్యంలో వీలైనంత ఎక్కువ ఆదాయం పొందేందుకు ప్రభుత్వం దరఖాస్తు సమయంలో వ్యాపారులకు కమిషన్ 20 శాతం ఉంటుందని ప్రకటించింది. ఆ తర్వాత విచిత్రంగా పన్ను రూపంలో 7 నుంచి 8 శాతం మేర కమిషన్ కోత పెట్టింది. మద్యం వ్యాపారం ద్వారా కోట్లు సంపాదించవచ్చని కొండంత ఆశతో రూ.లక్షలు, రూ.కోట్లు ఖర్చు చేసి పదుల సంఖ్యలో దరఖాస్తులు చేసి మరీ మద్యం షాపులు దక్కించుకున్న వారికి ప్రస్తుతం 12 శాతానికి మించి కమిషన్ రావడం లేదు. దీంతో నిర్వహణ భారంతో వైన్ షాపు నిర్వాహకులు విచ్చలవిడిగా బెల్టుషాపులు పెట్టించి సమయం, సందర్భం లేకుండా వైన్ షాపుల వద్దనే మరీ వంట, వార్పు పెట్టి మద్యం విక్రయం చేసి తాపిస్తున్నారు.

బార్లకు దెబ్బ..

మద్యం దుకాణాల ద్వారా రాత్రి 11 గంటల వరకు విక్రయాలకు అనుమతులు ఇచ్చింది. పైగా వైన్ షాపుల వద్దే తాగేందుకు ఏర్పాటు చేయడం, బార్‌లలో కల్పించే సౌకర్యాలన్నీ అందుబాటులో ఉంచడంతో బార్‌ల వ్యాపారం తగ్గిపోయిందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షలు పెట్టి బార్లు ఏర్పాటు చేస్తే నష్టాలు వచ్చే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

> **దాడులు చేస్తున్నాం**
>
> ఆదోని నియోజకవర్గంలో బెల్టుషాపులపై దాడులు చేస్తూనే ఉన్నాం. నవంబర్, డిశంబర్ నెలలో 12 కేసులు పెట్టాం. అంతేగాకుండా పట్టణంలో వైన్‌షాపుల వద్ద తాపుతున్న వారిపై కూడా దాడులు చేసి కేసులు రాశాం. పాత బ్రిడ్జి చివరన షెడ్ ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం.
>
> – సైదుల్లా, ఆదోని ఎక్సైజ్ సీఐ

ఎస్‌బీ ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజుకు అవార్డు



జిల్లా ఎస్పీ బిందుమాధవ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్‌ఐ ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు

ఎమ్మిగనూరురూరల్: విధుల్లో ప్రతిభ కనపరచినందుకు గాను స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజ్ అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లా ఎస్పీ బిందుమాధవ్ క్యాష్ రివార్డు, ప్రశంస పత్రాన్ని అందజేశారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

నందవరం : వీహెచ్‌పీ జిల్లా ప్రముఖ్ ఇంటిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఇంటిపై దాడికి నిరసనగా ఆ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. ఆదోని డివిజన్ వ్యాప్తంగా వీహెచ్‌పీ కార్యకర్తలు, ప్రముఖులు మండల కేంద్రానికి తరలి వచ్చి రస్తారోకో నిర్వహించారు. బాధితుడు ఉపేంద్రరెడ్డి ఇంటి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. రూరల్ సీఐ మధుసూధన్‌రావుకి వినతి పత్రం అందజేశారు. ఆందోళనలో వీహెచ్‌పీ ఆదోని జిల్లా అధ్యక్షులు బసవన్న గౌడ, ఉపాధ్యక్షులు భీమిరెడ్డి, కార్యదర్శి హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆదోని అర్బన్: జనవరి 12వ తేదీన కర్నూలులోని యాదవ హాస్టల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు పోలకల్ నాగేశ్వరరావు, యనకండ్ల శ్రీనివాసులు, చెన్నుపాడు రామకృష్ణ, కె.వెంకటాపురం వీరభాస్కర్, చింతమానుపల్లి గోవిందు, లింగందిన్నె ఈశ్వరయ్య తెలిపారు. ఆదివారం స్థానిక ఓ హోటల్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నూలులోని యాదవ్ హాస్టల్‌లో దాదాపు 500 మంది వరకు చదువుకున్నామన్నారు. చదువుకున్న వారంతా వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగులుగా స్థిరపడ్డారని చెప్పారు. ఉరుకుల పరుగుల జీవితంతో ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు స్నేహితులందరూ కలిసి అప్పటి జ్ఞాపకాలను నెమరేసుకునేందుకు కర్నూలులోని యాదవ్ హాస్టల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. హాస్టల్‌లో ఉండి చదువుకున్న ప్రతి యాదవ పూర్వ విద్యార్థులు, విద్యార్థులతో పాటు హాస్టల్ అభివృద్ధికి కోరే యాదవ సంఘం నాయకులు, యాదవులు పాల్గొనాలని కోరారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: మెరుగైన విద్య, వైద్యం, ఉపాధి కోసం సమరశీల పోరాటాలకు యువత, నిరుద్యోగులు సిద్ధం కావాలని సీపీఐ నాయకులు రంగన్న, పంపన్నగౌడ్, భాస్కర్ యాదవ్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజీవ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో సీపీఐ భవన్‌లో ఏఐవైఎఫ్ ఎమ్మిగనూరు, నందవరం మండలాల మహాసభ జరిగింది. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా మతం పేరుతో రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం విస్మరించిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా యువతను మోసం చేస్తోందని ఆరోపించారు. అన్ని శాఖల్లో ఖాళీగా వున్న పోస్టులను భర్తీ చేసేందుకు సత్వరం నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడిగా భాస్కర్, ఉపాధ్యక్షుడిగా మిథున్‌రాజు, కార్యదర్శిగా షాలెం యువరాజు, కోశాధికారిగా జక్కయ్య, నందవరం మండల అధ్యక్షుడిగా ప్రదీప్, ఉపాధ్యక్షులుగా దేవరాజు, రాజ్‌కుమార్, ప్రతాప్ కార్యదర్శిగా నరసింహులు, సహాయ కార్యదర్శులుగా నవీన్, చిన్న కోశాధికారిగా ధర్మానలను ఎన్నుకున్నారు.

చివరి ఆయకట్టు వరకు నీరందేలా చూడాలి

కౌతాళం: చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చూడాలని ఇటీవల ఎన్నికైన తుంగభద్ర ప్రాజెక్ట్ చైర్మన్ టిప్పు సుల్తాన్‌ను హోళగుంద, కౌతాళం మండలాల రైతులు, నాయకులు కోరారు. మండల కేంద్రం కౌతాళంలో ఆదివారం ఆయనను స్థానిక నాయకులు, అధికారులతో పాటు హొళగుంద మండలం నూర్‌బాషా దూదేకుల సంఘం నాయకులు కలిశారు. ఎల్లెల్సీ కౌతాళం, హొళగుంద మండలాల సెక్షన్లలో ఆయకట్టు రైతుల కష్టాలు, సాగునీటి ఇబ్బందులు ఇతర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కౌతాళం మండలం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మండల కో ఆప్షన్ మెంబరు మాబుసాబ్, రిటైర్డ్ తహసీల్దార్ షేక్షావలి, రౌడూరు దస్తగిరి, హొళగుంద నాయకులు హుసేన్‌పీరా, టీపీ పీరన్న, సిద్దిక్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

12న హైస్కూల్ ప్లాటినం జూబ్లీ మహాసమ్మేళనం



మహాసమ్మేళనం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పూర్వవిద్యార్థులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్లాటినం జూబ్లీ మహాసమ్మేళనం జనవరి 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఆదివారం పట్టణంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచాని రఘునాథ్‌తో కలిసి పూర్వవిద్యార్థులు ప్లాటినం జూబ్లీ వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. పాఠశాల, కళాశాల ప్రారంభమై 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాటి నుంచి ఈ విద్యాసంస్థల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకొని ,వేడుకలకు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్లాటినం జూబ్లీ వేడుకల ఆహ్వాన కమిటీ సభ్యులు శివకుమార్, బైలుప్పుల షఫీవుల్లా, ప్రకాష్‌జైన్, న్యాయవాది మల్లికార్జున, శాఫ్‌నెట్ వర్క్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పథకానికి మంగళం పాడే కుట్ర



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షులు నాగరాజు ఆరోపించారు. ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద వారికి ఉచిత వైద్యసేవలు అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టారన్నారు. ఆ తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేసిందన్నారు. గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ చికిత్స వ్యయం రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారని గుర్తు చేశారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి మంగళం పాడేలా చేస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయకుండా పథకాన్ని నిర్వీర్యం చేసే యోచనలో ఉందన్నారు. అంతే కాకుండా తాజాగా ఆరోగ్య బీమా అమలు చేస్తామని చెప్పడం దీనికి బలానిస్తోందని చెప్పారు. దీంతో పేదవాడికి మెరుగైన వైద్యం అందే పరిస్థితి లేదన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి పేదలకు ఉపయోగపడే పథకాన్ని సక్రమంగా అమలయ్యేలా చూడాలని కోరుతున్నారు.

కృష్ణమూర్తి సేవలు మరువలేనివి



కృష్ణమూర్తి దంపతులను సన్మానిస్తున్న జిల్లా సబ్ జైళ్ల అధికారి నరసింహారెడ్డి

ఆదోని రూరల్: ఆదోని సబ్ జైలులో చీఫ్ హెడ్ వార్డర్ బొమ్మగొని కృష్ణమూర్తి అందించిన సేవలు మరువలేనివని కర్నూలు జిల్లా సబ్ జైళ్ల అధికారి నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సబ్ జైలు ఆవరణలో బొమ్మగొని కృష్ణమూర్తి పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మగొని కృష్ణమూర్తి దంపతులకు జిల్లా సబ్ జైళ్ల అధికారి నరసింహారెడ్డి, తోటి సిబ్బంది పూలమాలలు వేసి సన్మానించారు. జిల్లా సబ్ జైళ్ల అధికారి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని చెప్పారు. విధి నిర్వహణలో నిజాయితీ పనిచేసిన ప్రతిఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. బొమ్మగొని కృష్ణమూర్తి ఖైదీలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకునేవారన్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చేవారని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది, తోటి ఉద్యోగులు పాల్గొన్నారు.



చెత్తాచెదారంతో నిండిన ప్రభుత్వ ఆసుపత్రి పాత భవనం

నిరుపయోగంగా ప్రభుత్వ ఆసుపత్రి భవనం

కోసిగి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యం వెనుక భాగంలోని భవనం నిర్వహణ లోపం కారణంగా నిరుపయోగంగా మారింది. ఆ భవనంలో గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహించేవారు. 30 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నామని ఆ భవనం పక్కన కొత్త హాస్పిటల్ నిర్మించారు. అయితే 30 పడకలు ఏర్పాటు చేయకుండా కేవలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నే కొత్త భవనలోని మార్చారు. దీంతో పాత భవనం నిరుపయోగంగా మారింది. ఆ భవనం ప్రాంగణంలో స్థానికులు చెత్తాచెదారం వేయడంతో పాటు మందుబాబులకు అడ్డుగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా మారిన ప్రభుత్వ భవనాలను ఉపయోగంలోకి తీసుకొచ్చి 30 పడకలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఖాదర్‌లింగ స్వామి దర్గా

- రేపు జగద్గురువు జన్మదిన వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ధర్మకర్త



పూజలందుకుంటున్న ఖాదర్‌లింగస్వామి దర్గా

కౌతాళం: సర్వమతాల సమ్మేళనానికి, మతసామరస్యానికి ప్రతీక ఖాదర్‌లింగ స్వామి దర్గా. తల్లి గర్భం నుంచే మహిమలు ప్రదర్శిస్తూ వేలాది మంది శిష్యులను కూడగట్టుకున్న గురువు ఖాదర్ లింగస్వామి పేదల కష్టాలను తీర్చే కరుణామయుడు. బహుబాషా కోవిదులు హజరత్ ఖాజా సయ్యద్‌షా అబ్దుల్ ఖాదిర్ మహమ్మద్ హుసేన్ ఆయన అసలు పేరు కాగా శిష్యులందరూ కలిసి శ్రీజగద్గురు ఖాదర్‌లింగ స్వామిగా పిలుస్తూ కొలుస్తున్నారు. రాష్ట్రంలోనే కాక పక్క రాష్ట్రాల్లో కూడా స్వామి వారికి భక్తులు ఉన్నారు. మంగళవారం స్వామివారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

రేపు జన్మదిన వేడుకలు

జగద్గురు ఖాదర్‌లింగ స్వామి 405వ జన్మదిన వేడుకలు ఈనెల 31న ఘనంగా నిర్వహించనున్నారు. ఈవేడుకలకు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు దర్గా ధర్మకర్త మున్నపాషా చిష్తీ తెలిపారు. జన్మదిన వేడుకల మహోత్సవం సందర్భంగా ఉదయం చదివింపులు అయ్యాక సాంఘిక కార్యక్రమాలు ఉంటాయని, సాయంత్రం స్వామి చిత్రపటానికి గ్రామ పుర వీధుల గుండా ఊరేగింపు కార్యక్రమం భక్తుల కోలహలం మధ్య జరుగుతుందని చెప్పారు. రాత్రి గ్రామ ప్రజలు, ఖాదర్‌లింగ స్వామి శిష్యులు, పీఠాధిపతులు, పలువురు ప్రముఖుల మధ్య కేక్‌కట్ చేసి వేడుకలను నిర్వహించనున్నట్లు దర్మకర్త తెలిపారు. మగ్రీబ్ నమాజ్ తర్వాత (సాయంత్రం) సమివుల్లా ఖాద్రి ఖాస్మీ వారిచే ప్రత్యేక బయాన్ ఉంటుందని చెప్పారు. రాత్రి ఖవ్వాలి పోటీలు ఉంటాయని, ఈ కార్యక్రమాలకు రాష్ట్ర నలుమూలల నుంచి హిందూ, ముస్లిం భక్తులు, ప్రముఖులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కౌతాళం ఉత్సవం ప్రత్యేకం

ముస్లిం మత గురువుల స్మారకార్థం ప్రతి ఏడాది జరుపుకునే మహోత్సవం అయినప్పటికీ ఇందులో కులమత భేదాలు లేకుండా హిందూ, ముస్లీం సోదరులు కలిసికట్టుగా ఈ ఉత్సవం జరుపుకోవడం కౌతాళంకే ప్రత్యేకం. రాష్ట్రం నలుమూల నుంచే కాక కర్ణాటక, మహరాష్ట్ర, తమిళనాడు వంటి రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ప్రార్థనలు జరుపుకుంటారు.

> **స్వామి చరిత్ర**
>
> పూర్వం కర్ణాటక రాష్ట్రంలోని బిజాపూర్ పట్టణంలో కొలవైన అమీనుద్దీన్ అలిఆలా షేర్‌ఏఖుదా వారి ఆజ్ఞానుసారం మానవుల్లో తమ మౌఢ్యాన్ని తొలగించి మతసామరస్యాన్ని చాటేందుకు ఖాదర్‌లింగస్వామి ఆంధ్ర- కర్ణాటక సరిహద్దులోని కౌతాళానికి వచ్చారు. అప్పట్లో ఆయన లింగాన్ని ధరించడంతో ఈ ప్రాంతంలో ఉన్న శైవమతస్తులు కొందరు అభ్యంతరం చెప్పారు. భగవంతుడు ఎవరి సొంతం కాదని, పరమేశ్వరుని ప్రతిక అయిన లింగంపై ఎవరికి హక్కు లేదని ఆయన వారితో వాదించారు. శైవ మతస్తులను సమావేశ పరిచి వారిలో మేడలో ఉన్న లింగాలను బావిలో వేసి, వాటిని మరల రప్పించి ధరింపజేస్తానని, తాను అలా చేయని పక్షంలో గ్రామం వదలి వెళ్లడానికి సిద్ధమని సవాలు విసిరారు. సాధించినచో తాను అక్రమించుకున్న స్థలంలో శ్వాశతంగా ఉండడానికి ఒప్పుకోవాలనే షరతు విధించారు. ఈ ప్రయత్నంలో ఆయన శివుడిని మెప్పించి లింగాలను బావినుంచి రప్పించారు. అప్పటి నుంచి గ్రామస్తులంతా ఆయనను మతాలకు అతీతంగా ఆయనను ఖాదర్‌లింగ స్వామిగా పూజించనారంభించారు. ఆయన ముగ్గురు భార్యలు, ఐదు మంది కుమారులు గ్రామస్తులు ఇచ్చిన స్థలంలోనే సమాధి అయ్యారు. ఆయన వంశస్తులు, ప్రస్తుత ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ దర్గా ట్రస్టీగా ఉన్నారు.

పౌష్టికాహారం.. ఆరోగ్యం పదిలం

- వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవాలి
- పోషకాలు కలిగిన ఆహారం అవసరం
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలి



తాజా కూరగాయలు

ఆదోని సెంట్రల్: సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, చలికాలం కనుక బద్ధకం ఏర్పడి వ్యాయామాలకు దూరంగా ఉండడం వలన పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. వ్యాధుల నుంచి రక్షణ పొందాలంటే ప్రతి ఒక్కరు వ్యాధినిరోధక శక్తి పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యులు చెబుతున్నారు. మనం రోజూ తీసుకొనే ఆహారంలో పోషకాలు ఉండే విధంగా చూసుకోవాలని.. అప్పుడే మన ఆరోగ్యాన్ని పదిలింగా ఉంచుకోవచ్చునని పేర్కొంటున్నారు.

ఆహారం ఇలా..

మన దైనందిన జీవితంలో ఉదయం పరిమితితో కూడిన ఇడ్లీ లేదా మొలకెత్తిన గింజలు లేదా పప్పులతో పాటు పాలు తీసుకోవచ్చు. ఉదయం 11 గంటల సమయంలో ఏదో ఒక పండు లేదా నిమ్మరసం లేదా జామకాయ తీసుకోవాలి. ఏవీ మనకు అందుబాటులో లేకపోతే ఒక గ్లాసు పాలైన తాగాలి. మధ్యాహ్నం వేళల్లో భోజనంతో పాటు ఆకు కూరలు, పెరుగు ఉండేలా చూసుకోవాలి. ఇక సాయంత్రం 5గంటల వేళల్లో గింజధాన్యాలు లేదా ఒక గ్లాసు పాలు తీసుకోవాలి. రాత్రి వేళల్లో భోజనం లేదా రెండు చపాతీలు లేదా పుల్కాలను కూరగాయలతో తీసుకుంటే మంచిది. ఎక్కువగా నీటికి ప్రాధాన్యతను ఇవ్వాలి. పరిశుభ్రమైన నీరు తాగాలి. సరిపడ నీరు తాగడం వలన శరీరంలో ఉండే 50 శాతం రుగ్మతలు దూరమవుతాయి. ఎక్కువగా కాచి వడబోసిన నీటినే తీసుకోవాల్సి ఉంటుంది.

తాజా కూరలతో పాటు పండ్లు

రోజు వారి ఆహారంలో తాజా ఆకుకూరలతో పాటు కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. పండ్లలో ఉండే సూక్ష్మ, పోషక పదార్థాలు శరీరానికి ఎంతగానో మేలు చేస్తాయి. పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు కొన్ని రకాల దీర్ఘకాలిక జబ్బులను దూరం చేస్తాయి. పచ్చిగా ఉండే తాజా కూరగాయలను జ్యూస్ రూపంలో కూడా తీసుకుంటే కూడా మంచిది. మనం తీసుకునే ఆహారంలో పప్పు ధాన్యాలు ఉండే విధంగా చూసుకోవాలి. అందులో పల్లీలు, మినుములు, శనగలు, బాదం పప్పు వంటి వాటితో పాటు తాజా ఆకు కూరలు ఆహారంలో ఉండేలా జాగ్రతలు తీసుకోవాలి. రోజూ ఉడికించిన గుడ్డు, వారానికి ఒక సారి చికెన్ లేదా మటన్ తీసుకోవాలి. జామ, నిమ్మ, ఉసిరి వంటి వాటిలో ఏదో ఒక దానిని తప్పకుండా తీసుకుంటే మంచిది.

నిల్వ చేసిన ఆహారం ప్రమాదం..

భోజనానికి ముందు తర్వాత తప్పని సరిగా చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. పరిశుభ్రమైన ఆహారంతో పాటు కాచి వడబోసిన నీటిని తాగాలి. నిల్వ చేసిన ఆహారం, తీపి పదార్థాలను తీసుకోకూడదు. బయట దొరికే రెడీమెడ్ ఫుడ్‌కు ఎంత దూరం ఉంటే అంత మంచిది. కూల్ డ్రింక్స్, ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తీసుకోకపోవడం మంచిదని వైద్యులు చెపుతున్నారు.

> **పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి**
>
> 
>
> పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలి. ఆహారంలో తోటకూర, మెంతి కూర, పాలకూర, మునగాకు వంటి వాటిలో ఏదో ఒకటి ఉండే విధంగా చూసుకోవాలి. క్యారెట్, బొప్పాయి, గుమ్మడి వంటివి తీసుకోవడం వలన శరీరానికి మంచి పోషకాలు లభిస్తాయి. ముఖ్యంగా మన దైనందిన జీవితంలో బయటి ఫుడ్‌కు దూరంగా ఉండాలి. క్రమం తప్పకుండా వ్యాయమం చేస్తూ తగిన జాగ్రతలను తీసుకుంటే మంచిది.
>
> – డా.వినోద్ కుమార్, యూహెచ్‌సీ, ఆదోని